సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



పశ్చిమలో తగ్గిన నేరాలు

పశ్చిమగోదావరి జిల్లాలో ఈ ఏడాదిలో పోలీసు శాఖ తీసుకున్న పకడ్బందీ చర్యలతో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది.

8లో ▸



గంజాయి పట్టివేత

జీలుగుమిల్లిలో రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో దాదాపు 220 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

8లో ▸



వర్జీనియా సాగు పరిశీలన

జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రం -1,-2 పరిధిలోని పలు గ్రామాలలో వర్జీనియా క్షేత్ర మిత్ర బృందం గురువారం పర్యటించింది.

8లో ▸

న్యూస్‌రీల్

మావుళ్లమ్మ మూలవిరాట్ దర్శనం



మావుళ్లమ్మను దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 60వ వార్షిక మహోత్సవాల సందర్భంగా అమ్మవారి అలంకరణ నిమిత్తం ఈనెల 9న మూలవిరాట్ దర్శనం నిలుపుదల చేశారు. అలంకరణ పనులు పూర్తయిన నేపథ్యంలో గురువారం అమ్మవారి మూలవిరాట్ పునఃదర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు సంప్రదాయ బద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



గ్రూప్‌–2 ప్రిలిమ్స్‌కు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమం

ఏలూరు (టూటౌన్): గ్రూప్‌–2 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే తాము అనుకున్న ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యాంసుందర్ అన్నారు. ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఏలూరు ఆధ్వర్యంలో గ్రూప్‌–2 ప్రిలిమ్స్ పరీక్షకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీఅభ్యర్థులకు ఉచిత శిక్షణ గురువారం డీఈఓ పి.శ్యాంసుందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రూప్‌–2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసినందున శిక్షణా కేంద్రంలో పాల్గొనే అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగాన్ని సొంతం చేసుకోవాలన్నారు. శిక్షణకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో మొత్తం 69 మంది దరఖాస్తు చేసుకోగా 32 మంది అభ్యర్థులు మొదటి రోజు హాజరయ్యారు. మొత్తం 50 రోజుల పాటు ఈ ఉచిత శిక్షణ అందించనున్నారు. కార్యక్రమంలో ఏలూరు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఆర్‌వీ నాగరాణి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.పుష్పలత, మెంటల్ ఎబిలిటీ ఫ్యాకల్టీ పి.ప్రసాద్, ఇండియన్ సొసైటీ ఫ్యాకల్టీ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ జన్మదిన వేడుకలు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు, చీఫ్ విప్ ప్రసాదరాజు, విప్ గ్రంధి శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

భీమవరం (ప్రకాశంచౌక్): కలెక్టరు జన్మదిన వేడుక సందర్భంగా గురువారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టరు చాంబరులో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావు, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, మండలి సభ్యుడు కవురు శ్రీనివాస్, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, పాలకొల్లు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి తదితరులు కలెక్టరును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏజెన్సీ, మెట్టకు తలమానికం

బుట్టాయగూడెం: తెలంగాణ–ఆంధ్రా బోర్డర్ జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం నుంచి పట్టిసీమ వరకూ చేపట్టనున్న నేషనల్ హైవే నాలుగు రోడ్ల రహదారి పనులు ఏజెన్సీ మెట్ట ప్రాంతానికి తలమానికంగా ఉండబోతున్నాయని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం శివారు అల్లికాల్వ వద్ద నేషనల్ హైవే 365 బీబీ రోడ్డు నిర్మాణం భూసేకరణకు సంబంధించిన పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్‌హెచ్ రోడ్డు నిర్మాణం పనులకు సంబంధించి బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం, బుట్టాయగూడెం, పోలవరం మండలం ఎల్ఎన్‌డిపేట పరిధిలో బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు జరగనున్నాయని అన్నారు. వీటికి సంబంధించి భూసేకరణ చేయనున్నట్లు తెలిపారు.

ఉన్నత చదువులకు చేయూత

- నేడు విద్యాదీవెన నిధులు విడుదల చేయనున్న సీఎం జగన్
- నాలుగేళ్లలో జిల్లాలో 1,77,996 మందికి రూ. 464.43 కోట్ల లబ్ధి
- భీమవరంలో నేడు 2023 జూలై–సెప్టెంబర్ క్వార్టర్ సాయం విడుదల చేయనున్న సీఎం జగన్
- 26,685 మంది విద్యార్థులకు రూ. 20.8 కోట్ల లబ్ధి



భీమవరం కలెక్టరేట్‌లో విద్యాదీవెన చెక్కు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి, భీమవరం: జగనన్న విద్యాదీవెన సాయాన్ని శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భీమవరం వేదికగా బటన్ నొక్కి రాష్ట్రవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. జిల్లాలోని 26,685 మంది విద్యార్థులకు 2023 జూలై– సెప్టెంబర్ క్వార్టర్‌కు సంబంధించి రూ. 20.8 కోట్ల సాయాన్ని తల్లుల ఖాతాలకు జమచేస్తారు. సీఎం పర్యటన నేపథ్యంలో భీమవరంలో ఎక్కడచూసినా పండుగ వాతావరణం నెలకొంది. రాష్ట్రంలో విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుంది. జగనన్న విద్యా, వసతి దీవెన లబ్ధి వారికి అక్కరకు వస్తున్నాయి. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, డిప్లమో వంటి కోర్సులు చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, అగ్రవర్ణ పేదల చదువులు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగేందుకు ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందిస్తుంది. దీనికి తోడు జగనన్న వసతి దీవెన పేరుతో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ ఆర్థిక సాయం అందిస్తుంది. ప్రభుత్వ సహకారం వల్ల తమలాంటి పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత విద్య కల నెరవేరుతుందంటూ ఆయా వర్గాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు సంవత్సరాలు క్రమం తప్పకుండా విద్యా, వసతి దీవెనల పథకాల ద్వారా పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నారు. కుటుంబంలో ఆయా ఉన్నత చదువులు చదివే విద్యార్థులు ఎంతమంది ఉన్నా అందరికి సాయం అందిస్తున్నారు. జిల్లాలో గత నాలుగేళ్లలో 1,77,996 మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం కింద జిల్లాలో రూ.464.43 కోట్ల సాయం అందించారు. 2023 జూలై– సెప్టెంబర్ క్వార్టర్‌కు సంబంధించి జగనన్న విద్యాదీవెన పథకంలో పశ్చిమ గోదావరి జిల్లాలోని 26,685 మంది విద్యార్థులకు సంబంధించి 24,276 మంది తల్లుల ఖాతాలకు రూ.20.8 కోట్ల సాయం ప్రభుత్వం శుక్రవారం అందజేస్తోంది.

జగనన్న విద్యాదీవెన సాయం			జగనన్న వసతి దీవెన		
సంవత్సరం	విద్యార్థులు	ప్రభుత్వ సాయం (రూ. కోట్లలో)	సంవత్సరం	విద్యార్థులు	ప్రభుత్వ సాయం (రూ. కోట్లలో)
2019–20	43,233	135.43	2019–20	42,909	40.12
2020–21	45,221	100.36	2020–21	44,672	42.21
2021–22	46,715	126.83	2021–22	46,304	42.20
2022–23	42,827	101.81	2022–23	42,257	38.88
	1,77,996	464.43		1,76,142	163.41

భీమవరంలో పండుగ వాతావరణం :
సీఎం జగన్ రాక సందర్భంగా భీమవరంలో పండుగ వాతావరణం కనిపించింది. లూథరన్ హైస్కూల్ ప్రాంగణంలోని హెలీప్యాడ్ వద్ద నుంచి బైపాస్‌రోడ్డులోని గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు మూడు కిలోమీటర్ల మేర ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు దారిపొడవునా స్వాగత ఫ్లెక్సీలు, పార్టీ జెండాలతో ముంచెత్తారు. తాలుకా ఆఫీస్ సెంటర్, ప్రకాష్ చౌక్, అంబేడ్కర్ సెంటర్, బైపాస్‌రోడ్డులోని బీవీ రాజు సర్కిళ్లను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

భారీ బందోబస్తు
జిల్లాతో పాటు ఏలూరు, తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి 2,072 మంది బందోబస్తులో పాల్గొంటున్నారు. ముగ్గురు ఏఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 31 మంది సీఐలు, 100 మంది ఎస్సైలు, 125 మంది ఏఎస్ఐలు, 293 మంది హెచ్‌సీలు , 675 మంది కానిస్టేబుళ్లు, 535 మంది హోంగార్డులు ఉన్నారు. హెలీప్యాడ్ నుంచి సీఎం రోడ్‌షో సాగే తాలుకా ఆఫీస్‌రోడ్డు, వెంకటరామాటాకీస్ రోడ్డు, పీపీ రోడ్డు, తాడేపల్లిగూడెం రోడ్డు, బైపాస్ రోడ్డు, సభా ప్రాంగణం ఏరియాలను పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. హెలీప్యాడ్, సభాప్రాంగణం ప్రాంతాలను బాంబు స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.



బైపాస్ రోడ్డును ఫ్లెక్సీలు, వైఎస్సార్‌సీపీ జెండాలతో ముంచెత్తిన దృశ్యం



హెలీప్యాడ్ వద్ద డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యాదీవెన నిధుల విడుదల కోసం ముఖ్యమంత్రి భీమవరం వస్తున్న నేపథ్యంలో.. కార్యక్రమం విజయవంతానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సీఎం పర్యటన పురస్కరించుకుని కలెక్టరు కార్యాలయం వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కలెక్టరు కార్యాలయంలో 20 మంది సిబ్బందితో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని రెవిన్యూ అధికారిని కలెక్టరు ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రసంగించే సభాస్థలిలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉదయం 8:30 గంటలకే మొదలు పెట్టాలన్నారు. 100 బస్సులు, 700 మినీ బస్సులకు వేర్వేరుగా పార్కింగు స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు. విష్ణు కాలేజీ రోడ్డు కూడలిలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. డీమార్టు దగ్గర జగనన్న తోడు, వ్యవసాయ శాఖ స్టాల్స్‌తో పాటు లబ్ధిదారులు ఉండేలా చూడాలన్నారు. బీఆర్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద మత్స్యకార భరోసా, లా నేస్తం స్టాల్స్‌తో పాటు లబ్ధిదారులు ఉండేలా చూడాలన్నారు. సభా వేదిక ప్రాంతం, బస్సులలో అల్పాహారం, తాగునీటిని ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన చోట్ల బయో టాయిలెట్లు సిద్ధం చేయాలన్నారు. సభాస్థలికి చేరే రూట్ మ్యాప్‌లు అందరికీ తెలిసేలా ప్రధాన కూడళ్లలో ప్రదర్శన చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే మార్గంలో పారిశుధ్య పనులు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. హెలీప్యాడ్, సభాస్థలి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని కలెక్టరు ఆదేశించారు. కార్యక్రమం జరిగే ప్రదేశంలో అంబులెన్సు సిద్ధంగా ఉంచాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖాధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఎస్.రామ సుందర్ రెడ్డి, డీఆర్‌ఓ బి.శివన్నారాయణ రెడ్డి, ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహం ఆవిష్కరణ


తాడేపల్లిగూడెం రూరల్: చరిత్రలో గొప్పవారి త్యాగాల గురించి తెలుసుకోవాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని నీలాద్రిపురంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కోసం పోరాడిన వారిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఒకరని పేర్కొన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదని, రాజకీయ పార్టీలకు వెన్నుముక అన్నారు. వారికి తగిన న్యాయం చేశారన్నారు. పాపన్నగౌడ్ వంటి వారి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం పాపన్నగౌడ్ చరిత్ర పుస్తకాన్ని డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణ రావు, ఎంపీటీసీలు మట్టా సత్యనారాయణ, జంపెల్లి సత్యవతి, మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరరావు, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చలపాటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాతా శ్రీనివాసరావు, జై గౌడ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావు, రాష్ట్ర అధ్యక్షుడు కిషోర్, జిల్లా అధ్యక్షుడు పర్సా వీర్రాజు, జిల్లా యువత అధ్యక్షుడు మిడత చందు, స్థల దాత ఉప్పలపాటి సత్యనారాయణ, విగ్రహ దాత అయినం చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



నీలాద్రిపురంలో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

మూగజీవిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

భీమడోలు: పూళ్లలో ఓ బావిలో పడిన ఆవును అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. గ్రామానికి చెందిన గండు నాగరాజు ఆవు బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు 35 అడుగుల లోతులో ఉన్న బావిలో పడిపోయింది. రైతు నాగరాజు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో భీమడోలు అగ్నిమాపక అధికారి నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఆవుకు ఎలాంటి గాయాలు కాకుండా స్థానికుల సాయంతో రెండు గంటల పాటు శ్రమించి సురక్షితంగా బయటకు తీశారు. మూగజీవిని కాపాడిన అగ్నిమాపక సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.



బావిలోంచి ఆవును బయటకు తీస్తున్న దృశ్యం

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం భీమవరంలో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక గ్రంధి వెంకటేశ్వరరావు జూనియర్ కళాశాల వద్ద లే అవుట్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదికను, లూథరన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను పరిశీలించారు. శుక్రవారం ఉదయం 10.40 గంటలకు లూథరన్ గ్రౌండ్‌కు సీఎం హెలికాప్టర్ చేరుకుంటుందని, అక్కడి నుంచి సభా వేదికకు సీఎం కాన్వాయ్ వెళ్తుందని.. ఈ మేరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులకు, పోలీసులకు సూచించారు. వేదిక, పబ్లిక్ గ్యాలరీ, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి సూచనలు, సలహాలు జారీ చేశారు.

పూర్తి రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తున్నాం: గ్రంధి శ్రీనివాస్
నేటి విద్యార్థులే రేపటి భవిష్యత్ అని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బలంగా నమ్మి విద్యకు తన పాలనలో పెద్దపీట వేశారని ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తూ వారి భవిష్యత్తును బంగారు బాటగా తీర్చిదిద్దుతున్నారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఉదయం 10 గంటలకు భీమవరం లూథరన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ చేరుకుంటారని, అక్కడి నుంచి రోడ్ షో చేస్తూ బైపాస్ రోడ్‌కు ఆనుకుని ఉన్న గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కాలేజీ వెనుక ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకుంటారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు విద్యార్థులు, ప్రజలు ఆయన రాక కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే కాలేజీలకు చంద్రబాబు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను సీఎం జగన్ చెల్లించి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. ప్రతి విద్యార్థి కూడా బాగా చదివి ఉన్నత స్థితికి చేరుకోవడం వల్ల వారి కుటుంబాలతో పాటుగా రాష్ట్రం కూడా అభివృద్ధి బాటలో ఉంటుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను భారీ స్థాయిలో విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.



లూథరన్ గ్రౌండ్‌లో హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, చీఫ్ విప్ ముదునూరి, విప్ గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి

భీమవరంలో ట్రాఫిక్ మళ్లింపు

భీమవరం: శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు డీఎస్పీ బండారు శ్రీనాథ్ తెలిపారు. తాడేపల్లిగూడెం వైపు నుంచి వచ్చే వాహనాలను గొల్లలకోడేరు వంతెన మీదుగా పాలకోడేరు, వేండ్ర, నవుడూరు సెంటర్ నుంచి వీరవాసరం మీదుగా పాలకొల్లు వైపునకు మళ్లిస్తున్నట్లు చెప్పారు. తాడేపల్లిగూడెం వైపు నుంచి ఉండి, కాళ్ల వెళ్లే వాహనాలను కొవ్వాడ అన్నవరం రోడ్డు నుంచి నర్సింహపురం వెంకటేశ్వరస్వామి ఆలయం పక్క నుంచి ఉండి వైపునకు, కాళ్ల వెళ్లే వాహనాలు పెద అమిరం ఎన్టీఆర్ విగ్రహం వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు. కాళ్ల, ఉండి నుంచి లోసరి వైపు వెళ్లే వాహనాలు భీమవరం పాత బస్టాండ్ నుంచి గొల్లవానితిప్ప మీదుగా లోసరి హైవే వైపునకు, లోసరి నుంచి వచ్చే వాహనాలు హన్సీ కల్యాణ మండపం నుంచి జువ్వలపాలెం రోడ్డుకు వెళ్లాలన్నారు. ఆకివీడు నుంచి వచ్చే భారీ వాహనాలు ఉండి సెంటర్ నుంచి గణపవరం మీదుగా, దిరుసుమర్రు, యనమదుర్రు వైపు నుంచి భీమవరం వచ్చే వాహనాలు సుంకర పద్దయ్యవీధి నుంచి భీమేశ్వరస్వామి ఆలయం, వీరమ్మపార్క్ మీదుగా గునుపూడి వైపునకు వెళ్లేలా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు తెలిపారు. తాడేరు వైపు నుంచి వచ్చే వాహనాలను గునుపూడి శివాలయం సెంటర్ నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా విస్సాకోడేరు వైపునకు పాలకొల్లు వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు వీరవాసరం సెంటరు నుంచి నవుడూరు వైపునకు వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ వివరించారు. వ్యాపార సంస్థలపై ఎలాంటి ఆంక్షలు లేవని చెప్పారు.

జనవరిలో నరసాపురం–హుబ్లీ రైలు

పాలకొల్లు సెంట్రల్: జనవరి మొదటి వారంలో నరసాపురం నుంచి హుబ్లీకి కొత్త రైలు ప్రారంభించనున్నారు. గురువారం విజయవాడ జోన్ డీఆర్‌యుసీసీ సభ్యుడు జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ వాణిజ్య పరంగా, ఉపాధి నిమిత్తం బళ్లారి, హొస్పేట, నంద్యాల ప్రాంతాల్లో ఉంటున్న బంధువులకు ఈ హుబ్లీ రైలు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సులోనే వెళ్లాల్సి వస్తుందని లేదంటే విజయవాడ వెళ్లి అక్కడి నుండి హుబ్లీ రైలు ఎక్కాల్సి వస్తుందన్నారు. రైలు జనవరి మొదటి వారం నుంచి నరసాపురం నుంచి బయలుదేరుతుందన్నారు. సమయం రైల్వే అధికారులు ప్రకటిస్తారన్నారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వచ్చే నెల మొదటి వారంలో నరసాపురంలో రైలును ప్రారంభిస్తారని తెలిపారు.

క్లుప్తంగా

చినవెంకన్న హుండీ ఆదాయం రూ.2.50 కోట్లు



హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ హుండీల లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో గురువారం అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ జరిగింది. ఈ లెక్కింపులో స్వామివారికి విశేష ఆదాయం సమకూరింది. గడచిన 21 రోజులకు గాను నగదు రూపేణా స్వామివారికి రూ.2,50,79,543 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు చెప్పారు. అలాగే కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 338 గ్రాముల బంగారం, 7.906 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. అదేవిధంగా లెక్కింపులోకి రాని రద్దు అయిన పాత రూ.2 వేలు, రూ.వెయ్యి, రూ.500 నోట్ల ద్వారా రూ.95,500 లభించినట్టు చెప్పారు. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు పవర్‌పేట సమీపంలో రైలు నుంచి ప్రమాదవశాత్తు పశ్చిమబెంగాల్‌కు చెందిన యువకుడు జారిపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పశ్చిమ బెంగాల్ ముషీదాబాద్ మదనపూర్ ప్రాంతానికి చెందిన నిజరుల్ షేక్ (24) అతని సోదరుడు కలిసి కేరళలోని యర్నాకుళం నుంచి హౌరాకు కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నారు. గురువారం రైలు ఏలూరు మీదుగా వెళ్తుండగా ఏలూరు పవర్‌పేట సమీపంలోని చిట్టివలస పాలకల వద్ద సిజరుల్ షేక్ బోగీ గుమ్మం వద్ద నుంచి ప్రమాదశాత్తు జారిపడి మృతి చెందాడు. అదే రైలులో ఉన్న సోదరుడు గుర్తించి ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురువారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పశ్చిమలో తగ్గిన నేరాలు

- 677 చోరీ కేసుల్లో సగానికి పైగా ఛేదింపు.. రూ.8 కోట్ల చోరీ సొత్తు రికవరీ
- ఇసుక, మద్యం, సారా అక్రమ రవాణా, జూదం, కోడిపందేలపై ఉక్కుపాదం
- మహిళలపై తగ్గిన అఘాయిత్యాలు.. 'దిశ' వినియోగంపై పెరిగిన అవగాహన

2023 రివైండ్ క్రైం



రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించేందుకు ఫోన్‌లో సిబ్బందికి సమాచారమిస్తున్న ఎస్పీ రవిప్రకాష్ (ఫైల్)



దొంగతనం కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు (ఫైల్)

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో ఈ ఏడాదిలో పోలీసు శాఖ తీసుకున్న పకడ్బందీ చర్యలతో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఎస్పీ యు.రవిప్రకాష్ నేతృత్వంలో పోలీసు యంత్రాంగం పటిష్టంగా పనిచేస్తోంది. దీనిలో భాగంగానే 2023 సంవత్సరంలో 677 చోరీ కేసులు నమోదు కాగా, రూ.12.59 కోట్ల విలువైన సొమ్ము చోరీకి గురికాగా వాటిలో 358 నేరాలను ఛేదించి రూ.8.08 కోట్ల సొమ్మును రికవరీ చేసి బాధితులకు అప్పగించడం విశేషం. దిశ యాప్ అందుబాటులోని రావడంతో మహిళల పట్ల నేరాలు 2022 సంవత్సరంతో పోల్చితే తగ్గాయి. గత ఏడాది 895 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది మొత్తం 745 కేసులు నమోదయ్యాయి. బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించిన 68 కేసులు నమోదైయ్యాయి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కేసులు గత ఏడాదితో పోల్చితే స్వల్పంగా పెరిగాయి. గత ఏడాది 95 కేసులు నమోదు కాగా ప్రస్తుత సంవత్సరం 104 కేసులు నమోదయ్యాయి.

ఇసుక, ఎక్సైజ్ నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఈ ఏడాది ఇసుక అక్రమ రవాణా, ఎక్సైజ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనిలో భాగంగా ఇసుక అక్రమ రవాణాపై 13 కేసులు నమోదు చేసి, 37 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి సుమారు 125 మెట్రిక్ టన్నుల ఇసుక, 23 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఎక్సైజ్ కేసుల్లో మద్యం అక్రమ రవాణాపై 73 కేసులు, సారా తయారీదారులపై 71 కేసులు నమోదు చేసి 167 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి 551 లీటర్ల ఐఎంఎఫ్ఎల్ మద్యం, 368 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తాగడం వల్ల కలిగే అనర్థాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో ఈ ఏడాది కేసులు తగ్గాయి. బియ్యం అక్రమ రవాణాపై 67 కేసుల్లో 157 మంది నిందితులను అరెస్టు చేసి 10.86 లక్షల కిలోల బియ్యాన్ని, 42 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మాదక ద్రవ్యాల కేసులకు సంబంధించి 57 కేసుల్లో 241 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 128 కిలోల గంజాయిని సీజ్ చేశారు. గంజాయి రవాణా, విక్రయాలు చేస్తున్న వారిపై రౌడీషీట్స్ ఓపెన్ చేయడంతో కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. జూదం నిర్వహిస్తున్నవారిపై 1,077 కేసులు నమోదు చేసి 5,606 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.1.60 కోట్ల నగదు, 492 వాహనాలు, 732 పందెం కోళ్లు, 928 కత్తులను సీజ్ చేశారు.

రోడ్డు ప్రమాదాల్లో 127 మంది మృతి

ఈ ఏడాది 452 రోడ్డు ప్రమాదాలు సంభవించి 127 మంది మృతి చెందగా, మరో 480 మంది గాయపడ్డారు. జిల్లావ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ డ్రైవ్‌లు ప్రత్యేకంగా నిర్వహించి వాహనచోదకుల్లో అవగాహన పెంచారు. గత ఏడాది నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో 927 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 1,890 కేసులు నమోదు చేశారు. బహిరంగంగా మద్యం తాగుతున్న 16,731 మందిపై కేసులు నమోదు చేశారు. అలాగే ఈ ఏడాది మోటార్ వాహనాల చట్టం కేసుల్లో 36,430 చలానాల ద్వారా సుమారు రూ.1.36 కోట్లు జరిమానాల రూపంలో వసూలు చేశారు.

220 కేజీల గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్ట్, లారీ స్వాధీనం
- ఎస్ఈబీ ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు వెల్లడి



జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ స్టేషన్‌లో పట్టుకున్న గంజాయి, నిందితులతో ఎస్ఈబీ అధికారులు

జంగారెడ్డిగూడెం: జీలుగుమిల్లిలో రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో ఓ లారీలో అక్రమంగా రవాణా చేస్తున్న 220 కేజీల గంజాయిని పట్టివేసినట్లు ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ఎన్.సూర్యచంద్రరరావు చెప్పారు. జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ స్టేషన్‌లో వివరాలను ఎస్ఈబీ ఏఎస్పీ గురువారం విలేకరులకు వెల్లడించారు. ఏలూరు జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు అందిన సమాచారం మేరకు సీఐ ధనరాజు, జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ సీఐ బి.శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి జీలుగుమిల్లి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లారీలో 110 గంజాయి ప్యాకెట్లను అక్రమంగా రవాణా చేస్తున్న గుర్తించారు. మొత్తం 220 కేజీల గంజాయి, లారీ స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను విచారణ చేయగా, ఉల్లిపాయ లోడుతో మహారాష్ట్ర నుంచి వరంగల్‌లో అన్‌లోడ్ చేశారన్నారు. అక్కడ ఔరంగబాద్‌కు చెందిన దీపక్, అమర్ అనే వ్యక్తులతో లారీ ఓనర్ కమ్ డ్రైవర్ అయిన అహ్మద్‌నగర్‌కు చెందిన సందీప్ శంకర్‌సరప్, హెల్పర్ ప్రకాష్ ధూత రాథోడ్ గంజాయి రవాణా కోసం కిరాయి మాట్లాడుకున్నారు. రాజమండ్రి సమీపంలో గుర్తు తెలియని ప్రాంతంలో గంజాయి ముఠా సభ్యుడు లోడింగ్ ప్రక్రియ పూర్తి చేశాడు. అక్కడ నుంచి తెలంగాణ వైపు వెళుతుండగా జీలుగుమిల్లి చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి లారీ ఓనర్ కమ్ డ్రైవర్ అహ్మద్‌నగర్‌కు చెందిన సందీప్ శంకర్‌సరప్, హెల్పర్ ప్రకాష్ ధూత రాథోడ్‌లను అరెస్టు చేసినట్లు సూర్యచంద్రరరావు తెలిపారు. డీటీఎఫ్ సీఐ ధనరాజ్, జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ సీఐ శ్రీనివాసరావు, ఎస్సైలు మస్తానయ్య, ఆదినారాయణ రావు, రామ్‌ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

కారు డ్రైవర్‌కు ఏడాది జైలు

గన్నవరం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతికి కారకుడైన కారు డ్రైవర్‌కు ఏడాది కఠిన కారాగార జైలుశిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ గన్నవరం 12వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు గురువారం తీర్పు ఇచ్చింది. ప్రాసిక్యూషన్ కథనం మేరకు విజయవాడలోని చిట్టినగర్‌కు చెందిన మెండెం సుబ్బారావు, అతని స్నేహితుడు కోసూరి ఆంజనేయులు 2020 ఏప్రిల్ 13న స్కూటీపై గన్నవరం వచ్చారు. తిరిగి వెళుతున్న వీరిని కేసరపల్లి శివారు దుర్గాపురం వద్ద కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సుబ్బారావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన గన్నవరం పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం తాడేపల్లిగూడెంకు చెందిన కారు డ్రైవర్ షేక్ ఖాశీం నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో జైలు శిక్ష మరో మూడు నెలలు పొడిగించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.ప్రసన్న చెప్పారు.

నేత్రపర్వం.. శ్రీవారి గ్రామోత్సవం



క్షేత్ర పురవీధుల్లో తొళక్క వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం నిర్వహించిన స్వామివారి తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. ఉదయం ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం పూజాధికాలను జరిపి హారతులిచ్చారు. తరువాత శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజసేవల నడుమ స్వామివారి తిరువీధి సేవ కన్నులపండువగా జరిగింది. ప్రతి ఇంటి ముంగిట భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన కూడలిలోని ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు పూజలు జరిపి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారి గ్రామోత్సవం రాత్రి క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా జరిగింది.

టీడీపీ మత్తులో పవన్

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ టీడీపీ మత్తులో ఉన్నాడని డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. గురువారం రాత్రి ఆయన ఈ విషయంపై మాట్లాడారు. జనసేన నాయకులు పొత్తును వ్యతిరేకిస్తూ దబ్బుళంతో పొడిచినా కూడా ఈ విషయంలో పవన్‌కు నొప్పి తెలియడంలేదన్నారు. చంద్రబాబు కోసమే జీవితాంతం పనిచేస్తానని జనసేనను స్థాపించిన పవన్ చెప్పడం సిగ్గుచేటన్నారు. జనసేనలో టీడీపీతో చెలిమిని వ్యతిరేకిస్తే పార్టీలో ఉండాల్సిన అవసరం లేదని, బయటకు వెళ్లిపోవచ్చని క్యాడర్‌కు పవన్‌కల్యాణ్ నిస్సిగ్గుగా చెబుతున్నారన్నారు. పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావడానికి జనసేన పార్టీని పెట్టలేదని, తెలుగుదేశం కోసం పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి జనసేన పనిచేస్తోందన్నారు. ఇది పవన్ కల్యాణ్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఇక జీవితంలో పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కానప్పుడు జనసేన నాయకులు ఆ పార్టీ కోసం ఎందుకు పనిచేయాలన్నారు. పవన్ నిర్ణయం తెలుగుదేశం పార్టీని ముందుకు నడిపించేలా ఉంది కానీ, జనసేనను ముందుకు తీసుకెళ్లేలా లేదన్నారు. అటువంటి పవన్ కోసం ఆ పార్టీ నాయకులు పనిచేయాల్సిన అవసరం ఉందా అన్నారు. ఈ విషయాన్ని జనసేన తమ్ముళ్లు ఒకసారి ఆలోచించాలన్నారు. పేదల పొట్టకొట్టి పెత్తందారులకు పెట్టడం చంద్రబాబు విధానం అయ్యితే, పేదల కోసం పనిచేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విధానమన్నారు. రానున్న ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధమన్నారు. పేదలకు మంచి జరుగుతుంటే పెత్తందారుల కోసం పనిచేసే తెలుగుదేశం ఓర్వలేకపోతోందన్నారు. తెలుగుదేశం, చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ ఆ పార్టీల అనుకూలశక్తులు, ఇలా దుష్టశక్తులన్నీ కలిసి మారీచుల్లా వేషాలు మార్చి ప్రజలను మోసం చేయడానికి రకరకాల కుట్రలు పన్నుతున్నాయని మంత్రి కొట్టు అన్నారు. తెలుగుదేశం కోసం పని చేసే పవన్‌తో వెళితే ఒడ్డుకు చేరలేరన్నారు. ఐదేళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటాడని లోకేష్ ప్రకటించిన దానికి పవన్ కల్యాణ్ ఏం సమాధానం చెబుతారన్నారు. తెలంగాణ ఎన్నికల్లో నోటాతో పోటీపడిన జనసేన పార్టీని ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం నాయకులు అవహేళన చేస్తున్నారన్నారు. జనంలో ఎలాంటి బలంలేని పవన్‌తో తమకు పని లేదని, జనసేనతో పొత్తుపెట్టుకోవాల్సిన అవసరం లేదని తెలుగుదేశం నాయకులు బహిరంగంగా చెబుతున్నారన్నారు. అయినా పవన్ కల్యాణ్ తెలుగుదేశం పార్టీని పట్టుకుని అంటకాగడం కాపు జాతికి తీరని అవమానం అన్నారు. రంగా హత్య, ముద్రగడ కుటుంబానికి వేధింపులు, రత్నాచల్ దగ్ధం కేసులో అక్రమ కేసులు వంటి వాటితో కాపు సామాజిక వర్గంలో తెలుగుదేశంపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. పవన్ కల్యాణ్ ద్వారా ఆ వ్యతిరేకత నుంచి బయటపడాలని చంద్రబాబు కుట్రపన్నారని ఆరోపించారు. దారితప్పి పక్కదారిలో నడుస్తున్న కొందరు కాపు సోదరులకు నిజాలు చెప్పి కనువిప్పు కలిగించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ సీఎం కొట్టు అన్నారు.

వృద్ధురాలికి లిఫ్ట్ ఇచ్చి.. చైన్ కొట్టేశాడు

ఉండి: వృద్ధురాలిని బైక్‌పై దింపుతానని చెప్పి కొంతదూరం తీసుకువెళ్లి ఆమె మెడలోని రెండుకాసుల బంగారపు గొలుసును ఓ ఆగంతకుడు తెంపుకుని పరారయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా కైకలూరు మండలం ఆలపాడు గ్రామానికి చెందిన శాఖమూరి ధనలక్ష్మి అనే వృద్ధురాలు గురువారం భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్న అనంతరం తిరిగి వెళ్లేందుకు బస్సు కోసం నిరీక్షిస్తోంది. అదే సమయంలో బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి వృద్ధురాలితో బస్సులు, ఆటోలు తిరగడం లేదని, తాను తన ద్విచక్రవాహనంపై ఆకివీడు వరకు దింపుతానని చెప్పడంతో అతడిని నమ్మి బైక్ ఎక్కింది. అయితే మహదేవపట్నం రోడ్డు వద్ద మద్యం గోడౌన్ సమీపంలోని ఓ అడ్డరోడ్డులోకి తన బైక్‌ను పోనిచ్చి దారి మారిపోయాను బండి దిగాలని వృద్ధురాలికి ఆగంతకుడు చెప్పాడు. ఆమె బైక్ దిగగానే ఆమె మెడలో ఉన్న రెండు కాసుల బంగారు చైన్‌ను లాక్కుని వెళ్లిపోయాడు. దీంతో వృద్ధురాలు లబోదిబోమంటూ ఉండి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఏఎస్సై ఎ.సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధుడి మృతి



ఏలూరు టౌన్: నూజివీడు రైల్వే స్టేషన్‌లో రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీసులకు గురువారం రాత్రి అందిన సమాచారంతో రైల్వే హెచ్‌సీ నంబూరి ఆదినారాయణ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు సుమారు 65 నుంచి 75 సంవత్సరాలు వయస్సు, నలుపు రంగు శరీరం, 5.5 ఎత్తు కలిగి ఉన్నాడు. తెలుపు, నీలం, నలుపు చారల చొక్కా, నీలం, తెలుపు, నలుపు గళ్ల లుంగీ, గంధం రంగు స్వెటర్ ధరించి ఉన్నాడు. చొక్కా కాలపై టైలర్ మార్కుగా జీఎస్‌రావు తణుకు అని లేబుల్ ఉంది. మృతుడు పశ్చిమగోదావరి జిల్లా ప్రాంతానికి చెందిన వాడై ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌కు గురువారం తరలించారు. మృతుని ఆచూకీ తెలిసినవారు ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ 80740 55378 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

నకిలీ కరెన్సీ స్వాధీనం



నకిలీ కరెన్సీని ప్రదర్శిస్తున్న పోలీసులు

కొయ్యలగూడెం: నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ విజయబాబు గురువారం సాయంత్రం పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లో ఎస్ఐ జీజే విష్ణువర్ధన్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ద్వారకాతిరుమల మండలం చెందిన ఒక వ్యక్తి నుండి మూడు లక్షల రూపాయలు అసలు నగదు ఇస్తే 14 లక్షల రూపాయల నకిలీ కరెన్సీ ఇస్తామని నలుగురు వ్యక్తులు ఒప్పందం కుదుర్చుకున్నారని అన్నారు. ఒప్పందం మేరకు కొయ్యలగూడెం సమీపంలోని ఓ దాబా హోటల్ వద్ద నిందితులు కరెన్సీని మార్చుకునే సమయంలో తమకు ముందుగానే వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు మరియు పోలీసు సిబ్బందితో కలసి ఆకస్మిక దాడిలో కొందరు పారిపోగా, ఏలేటి చంద్ర శేఖర్, దిరిసిపాము వెంకటేష్, చిట్ల నాగరాజు, గొల్లపల్లి ముత్తయ్య పట్టుబడ్డారని, వీరిని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి 13 లక్షల 96 వేల చిల్డ్రన్ కరెన్సీని, అదేవిధంగా 4 వేల రూపాయల అసలు నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురు నిందితులతో పాటు వారికి సంబంధించిన కారును సీజ్ చేసి స్టేషన్‌కి తరలించామని, విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడి చేస్తామని చెప్పారు.



పాలకొల్లు అర్బన్ : పాలకొల్లులోని బీఆర్ఎంవీ స్కూల్ గ్రౌండ్‌లో వాలీబాల్ సర్వీస్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి



పెదపాడు : పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ ఆడుతున్న ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

'ఆడుదాం ఆంధ్ర'తో జోష్

ఉమ్మడి జిల్లాలో 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. గురువారం పశ్చిమగోదావరి జిల్లాలోని 535 గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో నిర్వహించిన ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీల్లో 1,335 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో దాదాపు 13 వేల మంది క్రీడాకారులు పాల్గొనగా, గత మూడు రోజులుగా దాదాపు 81,860 మంది క్రీడలను తిలకించారు. అలాగే ఏలూరు జిల్లా వ్యాప్తంగా 625 సచివాలయాల స్థాయిలో 956 మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా, 730 మ్యాచ్‌లు జరిగాయి. దీంతో మొత్తంగా ఆడుదాం ఆంధ్ర పోటీల మూడో రోజుకు 3,280 మ్యాచ్‌లు జరిగాయి. సుమారు 33 వేల మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, గురువారం పలు చోట్ల జరిగిన పోటీల్లో ప్రజాప్రతినిధులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

– సాక్షి, నెట్‌వర్క్



పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం చింతపర్రు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఖోఖో ఆడుతున్న దృశ్యం



పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం చింతపర్రు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో కబడ్డీ ఆడుతున్న దృశ్యం

వర్జీనియాలో తెగుళ్లను నివారించండి



వర్జీనియా పంటను పరిశీలిస్తున్న క్షేత్ర మిత్ర బృందం సభ్యులు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రం-1, -2 పరిధిలోని పలు గ్రామాలలో వర్జీనియా క్షేత్ర మిత్ర బృందం గురువారం పర్యటించింది. పొగాకు బోర్డు అధికారులు, సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులతో కూడిన ఈ బృందం బుట్టాయిగుడెం, మర్రిగుడెం, సూరపవారిగుడెం, రెడ్డిగణపవరం, వేగవరం, చల్లావారిగుడెం, జీలుగుమిల్లి ప్రాంతాల్లో ఇటీవల మిచాంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించింది. పంటను సంరక్షించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. కాండం కుళ్లు తెగులు సోకి చనిపోయే స్థితిలో ఉన్న పొగాకు మొక్కలు కోలుకునే అవకాశం లేదన్నారు. కొత్తగా ఈ తెగులు సోకకుండా అమిస్టార్ లేదా కాబ్రియెటాప్ మందును 10 లీటర్ల నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి మొక్కల మొదలు తడిచేటట్టుగా పిచికారీ చేయాలన్నారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్త డా.వై.సుబ్బయ్య మాట్లాడుతూ తోటల్లో అక్కడక్కడ నల్లకాడ తెగులు కనిపిస్తోందని, దీని నివారణకు బైటాక్స్ లేదా కోనైడ్ మందు పిచికారీ చేయాలని సూచించారు. అధిక వర్షం కారణంగా మొక్కల పెరుగుదలకు 13045 మందును పిచికారీ చేయాలన్నారు. అంతర సేద్యం బాగా చేయాలని, చనిపోయి మొక్కలను తొలగించాలన్నారు. పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి ఎం.ఆదిశేషయ్య మాట్లాడుతూ అధిక నత్రజని వాడటం, అధిక వర్షాలు కురవడం వల్లె కాండం కుళ్లు తెగులు సోకిందన్నారు. నత్రజనితో సమానంగా పొటాష్ వేయాల్సి ఉంటుందని సూచించారు. పీఎస్ఎస్‌హెచ్ కంపెనీ లీఫ్ మేనేజర్ జె.రఘు మాట్లాడుతూ జిడ్డు మందును ఉపయోగించి పిలకలను నివారించుకోవాలని, 22 నుంచి 24 ఆకులకు తల కొట్టు వేయాలని రైతులకు సూచించారు. వేలం కేంద్రాల నిర్వహణాధికారులు బి.శ్రీహరి, జె.సురేంద్ర, ఐటీసీ ఎం.చారువాక, జీపీఐ జె.కల్యాణ్ పవన్, ఏకే దాస్, పొగాకు రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర'

- హుషారుగా క్రీడా పోటీలు
- గ్రామాల్లో యువత సందడి

అత్తిలి: మండలంలో గల గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు మూడవ రోజైన గురువారం వేడుకగా జరిగాయి. 7 సచివాలయాల పరిధిలో మహిళల కబడ్డీ, 13 సచివాలయాల పరిధిలో పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించారు. అత్తిలి, బల్లిపాడు, కొమ్మర, ఆరవల్లి, మంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలల క్రీడా ప్రాంగణాల్లో ఈ పోటీలు జరిపారు. అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ప్రారంభమైన మహిళల కబడ్డీ పోటీలను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీటీసీ అడ్డాల జానకి, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్ ప్రారంభించి, క్రీడా పోటీలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా కార్యదర్శి గంటా నాగరాజు, ఎస్సీసెల్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా సబ్బితి రాజేష్, సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ బుడితి సుజన్‌కుమార్, సేవాదళ్ అధ్యక్షుడు కంకటాల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజూ ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలు

తణుకు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం తణుకు మండలంలో వివిధ గ్రామాల్లోని సచివాలయాల పరిధి క్రీడా పోటీలు మూడో రోజూ కొనసాగాయి. గురువారం తణుకు మండలంలోని వేల్పూరు, దువ్వ, మండపాక, తేతలి తదితర గ్రామాల్లో రెండో రోజు వాలీబాల్, షటిల్ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈపోటీల్లో గురువారం వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు సంబంధించి మహిళలు, పురుషులకు వేర్వేరుగా జట్లుగా ఈ పోటీలను నిర్వాహకులు నిర్వహించారు. ఈపోటీల్లో గ్రామ కార్యదర్శులు వీ గంగాధరరావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

పెంటపాడు: క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని పలువురు వక్తలు తెలిపారు. మండలంలో మూడో రోజు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. పెంటపాడు, ప్రత్తిపాడు, మీనవిల్లూరు జెడ్పీ స్కూళ్లో కొండేపాడు, రామచంద్రపురం గ్రామాల్లో యువత సందడి చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు వీర్ల గోవింద్, వీర్ల వెంకటేష్, నాయకులు చల్లా లింగమూర్తి, కొండేపాడు సర్పంచ్ కట్టా దానయ్య తదితరులు మాట్లాడుతూ క్రీడాకారులతోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ఈ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే మన జీవితంలో క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలతో మానసిక ప్రశాంత సాధ్యపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలు జరిగాయి.



అత్తిలి: ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మహిళల కబడ్డీ పోటీలు



అత్తిలి: వాలీబాల్ పోటీలను పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, క్రీడాకారులు



తణుకు టౌన్: వేల్పూరులో క్రికెట్ పోటీలు జరుగుతున్న దృశ్యం



పెంటపాడు: ప్రత్తిపాడులో ఆడుదాం ఆంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం అర్బన్: 13వ వార్డులో క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేస్తున్న తెన్నేటి జగ్జీవన్



తాడేపల్లిగూడెం అర్బన్: ఎయిర్‌ఫీల్డ్ ల్యాండ్స్ వద్ద ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు

జోరుగా ఆడుదాం ఆంధ్ర పోటీలు

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు మూడో రోజు గురువారం జోరుగా సాగాయి. 12 వార్డులో క్రికెట్ పోటీలను కర్రి భాస్కరరావు టాస్ వేసి ప్రారంభించారు. 13వవార్డులో తెన్నేటి జగ్జీవన్ క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కర్రి భాస్కరరావు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి క్రీడాకారులను తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పట్టణంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు తమ వార్డుల క్రీడాకారులను పర్యవేక్షణ చేసుకోవాలని సూచనలు చేశారు. పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడలను మున్సిపల్ ఇంజినీర్ మురళీ, డీఈ సత్యనారాయణ, ఏఎస్ఓ సురేష్‌లు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

సందేహాలు నివృత్తి చేసుకోవాలి



దువ్వలో ఓటింగ్ మిషన్లపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తణుకు టౌన్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై గురువారం దువ్వ, మండపాక, ఎర్రనీలిగుంట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, సర్పంచ్ జానా వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ వట్టికూటి నాగేంద్ర ప్రసాద్, ఎంపీటీసీలు, ఏఎస్‌వో ఏ గోవర్ధనరావు, డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణరాజు, వీఆర్‌వో సుధాకర్ రావు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇరగవరం: ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌లు తమ్మిశెట్టి సత్యనారాయణ, కఠారి చంద్రమణి తెలిపారు. మండలంలోని తూర్పు విప్పర్రు, సూరంపూడి గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నార్ని తాతాజీ, తణుకు కన్వీనర్ అయినంపూడి శ్రీదేవి, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, ఈవోపీఆర్డీ నరసింహమూర్తి, కార్యదర్శి టి దుర్గా ప్రసాద్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి కారుమూరి



తణుకులో నిమ్మగడ్డ హాస్పిటల్ ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి, తదితరులు

తణుకు అర్బన్: వ్యాపార వాణిజ్యపరంగా దినదినాభివృద్ధి చెందుతున్న తణుకులాంటి ప్రాంతంలో రోగులకు అన్ని వసతులు అందుబాటులో ఉన్న ఆస్పత్రులు అందుబాటులోకి రావడం అభినందనీయమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. నిమ్మగడ్డ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను గురువారం మంత్రి కారుమూరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, సీనియర్ వైద్యులు డాక్టర్ తాతిన రామబ్రహ్మంతోపాటు తణుకు ఐఎంఏ వైద్యులు వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య పాల్గొన్నారు.

క్రీస్తు జననం మానవాళి విముక్తికి మార్గం



తేతలిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు టౌన్: క్రీస్తు జననం మానవాళి విముక్తికి మార్గమని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం రాత్రి తణుకు రూరల్ మండలం తేతలి, కొమరవరం గ్రామాల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి కారుమూరి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, భూపతిరాజు రామకృష్ణ, దారం శ్రీను, వలవల కిషోర్, వీరవల్లి సత్యనారాయణ, కొమరవరం గ్రామ సర్పంచ్ కరిబండి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ సమావేశం ఈ నెల 29వ తేదీ శుక్రవారం సాయంత్రం స్థానిక గీతా మందిరం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు సభాధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ వెల్లడించారు. విశిష్ట అతిథిగా దేవికా రాణి ఉడయార్, ట్రాక్ సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. కళాకారుడు ఆకుల నాగేశ్వరరావుకు గౌరవ సత్కారం, ప్రముఖ హార్మోనియం కళాకారుడు మోతే కృష్ణకు కళా సత్కారం, విశ్రాంత ఉపాధ్యాయులు మారం నరసింహారావుకు ఉద్యోగ సేవా పురస్కారం, అనారోగ్యంతో బాధపడుతున్న కళాకారిణి సీహెచ్. లలిత కుమారికి ఆర్థిక సత్కారం చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రముఖులు, కళాకారులు, సాహితీ ప్రముఖులు హాజరై సమావేశం విజయవంతం చేయాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం బేబి సెంటర్‌లో, వీకర్స్‌కాలనీ, యాగర్లపల్లి, కడకట్ల పట్టణ ఆరోగ్య కేంద్రాలు వద్ద గురువారం నిర్వహించిన క్షేత్ర స్థాయి సిబ్బంది సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల సంతానోత్పత్తిని వృద్ధి చేసే లార్వాలను సమూలంగా నిర్మూలించేందుకు ముందస్తు ప్రణాళికలతో కీటక నియంత్రణ చర్యలు పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గృహ సందర్శనాలు చేయాలని, అపరిశుభ్ర వాతావరణ లేని సమాజం కోసం ప్రజలలో అవగాహన కల్పించాలని, మలేరియా పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు చేయాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు, ఆశ వర్కర్లు, ఆరోగ్య పర్యవేక్షకులు మంగతాయరు, పద్మ, రమేష్, శ్యామ్, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

అత్తిలి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సాంకేతిక విద్యను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం 8వ తరగతి విద్యార్థులకు ఉచిత ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పైబోయిన మాట్లాడుతూ విద్యకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి, కోట్లాది రూపాయాలు వెచ్చిస్తోందన్నారు. విద్యతోనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని నమ్మిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడంతో నేడు మనరాష్ట్రంలో విద్యావ్యవస్థ ఉన్నత స్థానానికి చేరుకుందన్నారు. జగన్‌మామ ఇస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని, విద్యలో మంచి ప్రావీణ్యం సంపాదించి ఉన్నతస్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ అడ్డాల జానకి మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తున్నారని, విద్యార్థులు వాటిని సద్వినియోగ పర్చుకోవాలని కోరారు. ఈసందర్భంగా మండలంలోగల పది జెడ్పీ ఉన్నత పాఠశాలకు సంబంధించి 8వ తరగతి విద్యార్థులకు, వారితల్లిదండ్రుల సమక్షంలో ట్యాబ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంటావిజేత, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, బీసీ సెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా కార్యదర్శి గంటా నాగరాజు, ఎస్సీసెల్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా సబ్బితి రాజేష్, సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ బుడితి సుజన్‌కుమార్, సేవాదళ్ అధ్యక్షులు కంకటాల సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు చిటకన వెంకట్రావు, వేంద్ర రాంపండు, అప్పనపల్లి, ఎంపీడీవో అమీలుజమా, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎంఈవోలు రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ జన్మదిన వేడుకలు



తణుకులో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌కు కేకు తినిపిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆయనచేత కేకు కట్ చేయించారు. తణుకులో నిర్వహించిన ఈ వేడుకలో మంత్రి కారుమూరి స్వయంగా కేకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, గుబ్బల సూర్యచంద్రరావు, సీనియర్ వైద్యులు డాక్టర్ తాతిన రామబ్రహ్మం, ఐఎంఏ వైద్యులు పాల్గొన్నారు.

తణుకు టౌన్: ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ జన్మదినోత్సవ వేడుకలు గురువారం తణుకు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు రవీంద్రనాథ్‌ను తణుకు సజ్జాపురంలోని ఆయన నివాసం వద్ద పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు మల్లిన రామచంద్రరావు, చిలుకూరి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఎంపీపీ రుద్ర ధనరాజు, నాయకులు ముళ్లపూడి బాబూరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ వంకా రాజకుమారి, వంకా రఘువీర్, సింహాద్రి రవళి, వికాస్, శ్రావ్య, ఎంపీటీసీలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఎమ్మెల్సీకు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి కొట్టును కలిసిన పసల



ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను సత్కరిస్తున్న పశుగణాభివృద్ధి ఉమ్మడి జిల్లాల చైర్మన్ పసల కనక సుందరరావు

తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రజలకు సేవ చేసే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పట్టణంలో గురువారం ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద పశుగణాభివృద్ధి చైర్మన్‌గా నియమితులైన పసల కనకసుందరరావు ఉప ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీకి చిత్తశుద్ధితో సేవలందించిన వారికి సముచిత స్థానం కల్పిస్తుందని కొట్టు అన్నారు. పదవులు పొంది ఉన్నత స్థానాలకు ఎదిగేకొద్దీ బాధ్యత మనపై మరింత పెరుగుతుందన్నారు. తమ పదవులకు వన్నె తెచ్చే విధంగా నడుచుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కాంగ్రెస్ పార్టీకి ప్రజలందరూ ఓట్లు వేసి అధిక మెజార్టీతో జగన్‌ను ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. అలాగే అనంతరం పసల కనకసుందరావు, జడ్డు హరిబాబులను మంత్రి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, ఎంపీపీ పానుకుమాటి శేషులత, పసల చంటి, బుద్దాల వెంకటరామారావు, తమ్మిశెట్టి చుక్కయ్య, పసల శ్రీకృష్ణ, సత్తిరాజు పాల్గొన్నారు.

విప్పర్రు నుంచి గూడెం వరకు ర్యాలీ

పెంటపాడు: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన పసల కనకసుందర్రావుకు మండల రైతుల నుంచి భారీ మద్దతు లభించింది. ఈ సందర్భంగా గురువారం ఉపముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపేందుకు గూడెం వెళ్తూ విప్పర్రు నుంచి సుమారు 500 మంది మోటార్‌సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు చోడగిరి చినబాబు, పసల శ్రీ కృష్ణ, సూర్పరాజు, పసల నాగసత్యనారాయణమూర్తి, విప్పర్రు గ్రామ మాజీ సర్పంచ్ పసల గంగారామచంద్రన్(చంటి), నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆరుగొలను సబ్ స్టేషన్ పరిధిలోని ఆరుగొలను, కొత్తూరు, నవాబుపాలెం, కృష్ణాయపాలెం, ఆరుళ్ళ, నందమూరు, మారంపల్లి, దండగర్ర, లింగారాయుడిగూడెం, అమృతపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక టూ టౌన్‌లోని సౌత్ టౌన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను నరికేందుకు గాను ఈ నెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. జువ్వలపాలెం, తణుకు రోడ్డు, సవిత్రుపేట, బీఆర్ మార్కెట్ ఏరియా, నవ్వారుపేట, కొత్త గూడెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

267 మందికి వైద్య పరీక్షలు

పెంటపాడు: మండలంలోని అలంపురం వెంకటరమణ చారిటీ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన మెడికల్ క్యాంపులో 267 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో జనరల్ మెడిసిన్41, అంకాలజీ 5, గైనకాలజీ 18, చిన్నపిల్లల వ్యాధులకు 4, కార్డియాలజీకి 27, ఈసీజీ, 35, 2డి ఈకో 3, స్కానింగ్ 7, ఫిజియోథెరపీ 26, దంత పరీక్షలకు 35 ఇంకా పలువురు చిన్నారులు, సిబ్బంది వైద్యపరీక్షలు చేయించుకొన్నారు. భీమవరం డెంటల్ ఆసుపత్రికి, రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి, లయన్స్ కంటి ఆసుపత్రికి పలువురిని రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వ్యవస్థాపకులు కొలనువాడ పెదకృష్ణంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రాచర్లలో పౌర హక్కుల దినోత్సవం

పెంటపాడు: భారత రాజ్యాంగం అమలుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ జిల్లా సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాచర్ల సచివాలయం వద్ద పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వాకా దుర్గాభవాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, పెంటపాడు ఎస్సీ బాలికల వెల్ఫేర్ అధికారి ఎ. అరుణజ్యోతి, కార్యదర్శి బాబు, వీఆర్వో సూర్యకుమారి, బీసీ సంఘ నాయకులు వాకా వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో చేనేత కార్మికుల అవగాహన సదస్సు

పెంటపాడు: ప్రజల మేలు కోసం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు చల్లా లింగమూర్తి పేర్కొన్నారు. గురువారం రామచంద్రపురం చేనేత వీవర్స్ సొసైటీ సంఘ కార్యాలయం వద్ద కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సదస్సులో క్లస్టర్ డవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద మంజూరైన సోలార్‌లైట్లు, ఫ్రేమ్ బాక్సులు, వర్కుషెడ్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు ధనుంజయరావు, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి ఎస్. రఘునంద, అధికారులు బి.రామయ్య, బి. హనుమంతరావు, రామచంద్రపురం, మీనవిల్లూరు గ్రామ సర్పంచ్‌లు చల్లా నాగమణి, చింతపల్లి లక్ష్మి, గ్రామ మాజీ సర్పంచ్ చల్లాకుమారస్వామి, సొసైటీ మేనేజర్ కేటీకే నాగేశ్వరరావు, నాయకులు తిప్పా సాయి శివసుబ్రహ్మణ్యం, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.